# మోడరన్ కథలు



సాయంత్రం ఏడుగంటలు...

అందంగా ముస్తాబై భర్తకోసం ఎదురుచూస్తోంది 'దీరజ' పదినిమిషాల తర్వాత వచ్చిన భర్తని చూసి సిగ్గుపడింది.

''ఏమిటి మేడంగారు చాలా హుషారుగా ఉన్నారు'' అన్నాడు 'గోపాల్'.

''మీకో గుడ్‌న్యూస్ చెప్తాను నాకేమిస్తారు?'' కొంటెగా అంది.



## ఎవరికి చెప్పాలి?

మల్లం శ్రీహరి

''గుడ్‌న్యూసా! ఏంటోయ్ అది. మీ నాన్న మన పెళ్ళికి ఇస్తానన్న స్కూటర్ పంపించాడా ఏమిటి?'' చిన్నగా నవ్వుతూ అన్నాడు.

''అబ్బ! ఎప్పుడూ మీకు అదే గొడవ. అంతకంటే గుడ్‌న్యూస్ చెప్తాను'' అంది చిరుకోపంగా.

''కొంపదీసి పక్కింటి పార్వతమ్మ మొగుడు పనిమనిషితో లేచిపోలేదు కదా?''

''అయ్యోరామా! మంది విషయాలు మనకెందు కండి?'' కోపంగా అంది.

''అబ్బ! సస్పెన్స్‌తో చంపేస్తున్నావోయ్. ఆ గుడ్‌న్యూస్ నువ్వే చెప్పేయకూడదూ?''

''ఛీ! మీదుట్టి మట్టి బుర్ర''

''అవునోయ్ ఒప్పుకుంటున్నాను. అసలు విషయం తొందరగా చెప్పు'' ఆత్రంగా అడిగాడు.

''మీరు తండ్రికాబోతున్నారు'' చెప్పిండి సిగ్గు పడ్తూ.

''ఆ! నిజమా? అంటూ సంతోషంతో ఆమెను రెండుచేతులతో ఎత్తుకొని ముఖాన్ని ముద్దులతో ముంచెత్తాడు. ''థాంక్స్ డార్లింగ్! థాంక్ యూ వెరీమచ్. ఈ రోజు నాకెంత సంతోషంగా ఉందో తెల్సా?'' అంటూ ఆమెను కౌగిలిలోకి తీసుకున్నాడు.

★ ★ ★

''ఏమండీ ఈ రోజు ఆఫీసు నుంచి త్వరగా రండి'' చెప్పింది దీరజ.

''ఎందుకోయ్?'' కాఫీ సిప్ చేస్తూ అన్నాడు.

''సాయంత్రం ట్యాంక్‌బండ్ కెళ్దామండి''

''అలాగే'' అంటూ వెళ్ళిపోయాడు గోపాల్

★ ★ ★

సాయంత్రం......

ట్యాంక్‌బండ్ ఎంతో ప్రశాంతంగా ఉంది.

విగ్రహాల చాటున కొన్ని ప్రేమజంటలు.

పచ్చని గడ్డిపై దంపతులు, పిల్లలు ఆటపాటలతో అక్కడి వాతావరణం ఎంతో మనోహరంగా అనిపించింది వాళ్ళిద్దరికీ.

''అటుచూడోయ్! ఆ పాప ఎంత ముద్దొస్తుందో'' అన్నాడు గోపాల్.

''అవునండి. మనకు పుట్టబోయే బాబుతో వారంవారం ఇలాగే వద్దామండీ.''

''అలాగే కాని బాబుతో కాదు''

''మరి?''

''పాపతో''

''అదేం కుదరదు నేను బాబునే కంటాను'' మురిపెంగా అంది.

''ఓ పని చేయ్!''

''ఏంటది?'' ఆశ్చర్యంగా అడిగింది దీరజ.

''ఇద్దర్ని కంటే?''

''ఛీ! పొండి!'' అంటూ సిగ్గుపడింది.

''అవునోయ్! ఎలాగు ఇంతదూరం వచ్చావ్ కదా! బిర్లామందిర్‌కి కూడా వెళ్ళొద్దాం'' అన్నాడు.

''ఇప్పుడెందుకండి?''

''ఎందుకేంటోయ్! ఇన్నాళ్ళు నాలో ఏదో లోప ముందని, డాక్టర్ దగ్గరకి వెళ్దామని పోరుపెట్టేదానివి కదా? మరి ఇప్పుడేమంటావ్?'' గర్వంగా అన్నాడు.

''సారీ! తప్పయిందంటాను'' అంది తలదించుకొని.

''అందుకే పెళ్ళి అయినా అయిదు సంవత్సరాలకు కరుణించిన ఆ దేవునికి కృతజ్ఞతలు చెప్పుకొని వద్దాం పద'' లేస్తూ అన్నాడు.

అప్పుడు ఆలోచించింది దీరజ.

'సంతానం కోసం ఎన్నోపూజలు, దానధర్మాలు చేసినా కరుణించలేని ఆ దేవుళ్ళకు కృతజ్ఞతలు చెప్పాలా?'

తప్పని తెలిసినా నా జన్మసార్థకం చేయడానికి ఒప్పుకున్న 'అద్దెకున్న అబ్బాయికి' కృతజ్ఞతలు చెప్పాలా?

ఎవరికి చెప్పాలి? భర్త వెంట పాదాలు నడిచినా మనసు మాత్రం ఆమెను నిలదీస్తూనే వుంది.

●